మంగళవారం 22-10-2024

# ముందడుగు

సంపుటి: 1, సంచిక: 490 పేజీలు: 4 | ₹6


SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | JAGITYAL | KHAMMAM | NALGONDA | MAHABOOBNAGAR | NIZAMABAD

EPAPER.MUNDADUGU.COM

దినపత్రిక

మీ ప్రాంతంలో జరిగే ఏలాంటి సమస్య ఐనా ముందడుగు దృష్టికి తీసుకురండి.. సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేద్దాం. మీ ప్రాంతంలో మీరు ముందడుగు పౌర పాత్రికేయుడిగా పనిచెయొచ్చు.. మీ సమస్యలపై స్పందించండి..

Mundadugu whatsapp:
9491114616
email: mundadugu111@gmail.com



తెలంగాణలో ప్రారంభమైన గ్రూప్- 1 పరీక్షలు

మిగతా 2లో



విమాన బెదిరింపు కాల్స్ చేస్తే జీవిత ఖైదు

మిగతా 2లో



ప్రజలపై విద్యుత్ భారాన్ని మోపుతున్నారు

మిగతా 3లో



ఈ 5 వ్యాధులతోనే ఎక్కువమంది చనిపోతున్నారు

మిగతా 5లో

## ఉగ్రవాదంపై యుద్ధం ఇంకా ముగియలేదు

### దేశంలో ఉగ్రవాదాన్ని పూర్తిగా తుడిచేద్దాం

### కేంద్ర హోంమంత్రి అమిత్ షా



ముందడుగు జాతీయం:

దేశంలో ఉగ్రవాదంపై యుద్ధం ఇంకా ముగియలేదని, ఉగ్రవాదాన్ని పూర్తిగా తుడిచిపెట్టాలనే సంకల్పంతో తమ ప్రభుత్వం పని చేస్తోందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. ఢిల్లీలో జరిగిన పోలీసు అమరవీరుల సంస్మరణ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదుల కార్యకలాపాలను అణచివేయడానికి భారత బలగాలు గత పదేళ్లుగా శాయశక్తులా కృషి చేస్తున్నాయని అన్నారు. మిగతా 2లో



## ప్రపంచానికి భారత్ ఆశాకిరణం

### దేశం ప్రతి రంగంలో అభివృద్ధి చెందుతోంది

### 'ది ఎన్డీటీవీ వరల్డ్ సమ్మిట్‌లో ప్రధాని మోడీ

ముందడుగు జాతీయం:

దేశం ప్రతి రంగంలో శరవేగంగా అభివృద్ధి చెందుతోందని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. 'ది ఎన్డీటీవీ వరల్డ్ సమ్మిట్'లో ప్రారంభోపన్యాసం చేశారు. ప్రపంచానికి భారత్ ఆశాకిరణంలా కనిపిస్తోందన్నారు. మిగతా 2లో

## పోలీసు అమరుల కుటుంబాలను ఆదుకుంటాం

### ర్యాంకుల వారీగా పరిహారం ప్రకటన

### అమరవీరుల సంస్మరణ కార్యక్రమంలో రేవంత్

ముందడుగు తెలంగాణ:

తెలంగాణ రాష్ట్రంలో శాంతి భద్రతలు, నిఘా విషయంలో తెలంగాణ పోలీసుల పాత్ర కీలకమని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని గోషామహల్ స్టేడియంలో నిర్వహించిన పోలీసు అమరవీరుల సంస్మరణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు.

మిగతా 2లో



## తెలంగాణ గ్రూప్1పై జోక్యం చేసుకోం

### ఫలితాల విడుదలకు ముందే విచారణ ముగియాలి

### తెలంగాణ హైకోర్టుకు సుప్రీంకోర్టు సూచన



ముందడుగు ఢిల్లీ:

తెలంగాణలో జరుగుతున్న గ్రూప్1 పరీక్షపై అభ్యర్థుల దాఖలు చేసిన పిటిషన్‌పై జోక్యం చేసుకునేందుకు, మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. హైకోర్టు తన మధ్యంతర ఉత్తర్వుల్లో అన్ని అంశాలూ స్పష్టంగా చెప్పిందని సీజేఐ

ముందడుగు

మంగళవారం, 22-10-2024, హైదరాబాద్

# ఉగ్రవాదంపై యుద్ధం ఇంకా ముగియలేదు

(మొదటిపేజీ తరువాయి)

డ్రగ్స్, భారత వ్యతిరేక చర్యలు, ఉగ్రవాదాన్ని తుడిచిపెట్టడానికి ఎన్డీఏ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని స్పష్టం చేశారు. 2047 నాటికి భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా మార్చడమే తమ లక్ష్యమన్నారు.

స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు దేశాన్ని రక్షించడానికి 36,468 మంది పోలీసులు ప్రాణాలు కోల్పోయారని.. వారి త్యాగాల వల్లే దేశం సురక్షితంగా ఉందని అమిత్ షా అన్నారు. గత ఏడాది కాలంలో దాదాపు 216 మంది పోలీసు సిబ్బంది విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయారని పేర్కొన్నారు. వీరి త్యాగాలను దేశం ఎప్పటికీ మరిచిపోదన్నారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు అమరవీరులకు అమిత్ షా నివాళులర్పించారు. 1959లో లడఖ్‌లో చైనా సైనికులు జరిపిన ఆకస్మిక దాడిలో మరణించిన పోలీసులు, ఇతర అధికారుల త్యాగాలను గుర్తు చేసుకుంటూ ప్రతి సంవత్సరం అక్టోబర్ 21న పోలీసు సంస్మరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

# ప్రపంచానికి భారత్ ఆశాకిరణం

(మొదటిపేజీ తరువాయి)

"మా ప్రభుత్వం ఇప్పటికే 125 రోజులు పూర్తి చేసుకొంది. ఈ కాలంలో మా ప్రభుత్వ అనుభవాన్ని మీతో పంచుకుంటాను. పేదలకు 3 కోట్ల కొత్త పక్కా గృహాలు ఇచ్చాం. రూ.9 లక్షల కోట్ల ఇన్ఫ్రా ప్రాజెక్టులపై పని మొదలైంది. 15 వందేభారత్ రైళ్ల ప్రారంభించాం. 8 కొత్త ఎయిర్ పోర్టుల పనికి శ్రీకారం చుట్టాం. యువతకు రూ.2లక్షల కోట్ల రూపాయల ప్యాకేజీ ఇచ్చాం. రైతుల ఖాతాల్లో రూ.21 వేల కోట్లను బదిలీ చేశాం. 70 ఏళ్లు దాటిన వృద్ధులకు ఉచిత వైద్యానికి ఏర్పాట్లు చేశాం. 5 లక్షల ఇళ్లలో రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థలు ఏర్పాటు చేశాం. స్టాక్ మార్కెట్ సూచీల్లో దాదాపు 7 శాతం వృద్ధి నమోదైంది. విదేశీ మారకద్రవ్యం 700 బిలియన్ డాలర్లను దాటేసింది. నేను కేవలం 125 రోజుల్లో జరిగిందే చెబుతున్నాను అని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

# పోలీసు అమరుల కుటుంబాలను ఆదుకుంటాం






(మొదటిపేజీ తరువాయి)

దేశ భద్రత, ప్రజల రక్షణలో పోలీసుల పాత్ర ఎనలేనిదన్నారు. అమరులైన వారి కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని చెప్పారు. విధి నిర్వహణలో మరణించిన అధికారులను గుర్తు చేసుకోవడం అందరికీ స్ఫూర్తిదాయకమని చెప్పారు. అమరులైన కానిస్టేబుల్, ఏఎస్సై కుటుంబాలకు రూ.కోటి పరిహారం ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. అమరులైన ఎస్సై, సీఐ కుటుంబాలకు రూ.కోటి 25 లక్షలు.. డీఎస్పీ, ఏఎస్పీ కుటుంబాలకు రూ.కోటి 50 లక్షలు.. ఎస్పీ, ఐపీఎస్ కుటుంబాలకు రూ.2 కోట్ల పరిహారం ఇస్తామన్నారు. శాశ్వత అంగవైకల్యం పొందిన పోలీసులకు పరిహారం ఇస్తామని ప్రకటించారు.

# తెలంగాణ గ్రూప్1పై జోక్యం చేసుకోం



(మొదటిపేజీ తరువాయి)

నేతృత్వంలోని ధర్మాసనం తెలిపింది. అభ్యర్థులు పరీక్షా కేంద్రాల్లో ఉన్నప్పుడు జోక్యం చేసుకోవడం సరికాదని పేర్కొంది. ఫలితాల విడుదలకు ముందే తుది విచారణ ముగించాలని హైకోర్టుకు సూచించింది.

వాదనల సందర్భంగా.. 14ఏళ్ల తర్వాత గ్రూప్1 పరీక్ష జరుగుతోందని అభ్యర్థుల తరపు న్యాయవాది తెలిపారు. సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధంగా రాష్ట్ర ప్రభుత్వం జీవో 29 తెచ్చిందని తెలిపారు. పరీక్షపై హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిందని రాష్ట్ర ప్రభుత్వ తరపు న్యాయవాది చెప్పారు. ఇరువర్గాల వాదనలు విన్న సుప్రీంకోర్టు గ్రూప్1 పరీక్ష నిలుపుదల కుదరదని తేల్చి చెప్పింది. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 29 రద్దు చేయాలని కోరుతూ గ్రూప్1 అభ్యర్థులు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. తీర్పు వచ్చే వరకు పరీక్షలు వాయిదా వేయాలని కోరారు. జీవో 55నే అమలు చేయాలని కోరినా సీఎం పట్టించుకోవడం లేదని పిటిషన్‌లో పేర్కొన్నారు.

### తెలంగాణలో ప్రారంభమైన

# గ్రూప్ 1 పరీక్షలు

## పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట భద్రత



**ముందడుగు తెలంగాణ:** తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న గ్రూప్1 మెయిన్స్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. 31,383 మంది అభ్యర్థులు ఈ పరీక్షలు రాస్తున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు పరీక్షా కేంద్రాల గేట్లను అధికారులు మూసివేశారు. ఆలస్యంగా వచ్చిన వారిని లోపలికి అనుమతించలేదు. తొలిరోజు జనరల్ ఇంగ్లీష్ పేపర్ పరీక్ష నిర్వహించారు. రేపటి నుంచి ఈనెల 27 వరకు వివిధ సబ్జెక్టుల ప్రకారం పరీక్షలు జరగనున్నాయి.

పరీక్షలను వాయిదా వేయాలంటూ ఆందోళనలు జరుగుతున్న నేపథ్యంలో కేంద్రాల వద్ద పోలీసులు పటిష్ట భద్రత ఏర్పాటు చేశారు. అన్ని కేంద్రాల వద్ద బీఎన్ఎస్ఎస్ 163 సెక్షన్ విధించారు. దీని ప్రకారం 200 మీటర్ల వరకు ఐదుగురికి మించి ఉండేందుకు వీల్లేదు. ప్రతి కేంద్రం వద్ద ఒక ఎస్సై ఆధ్వర్యంలో మహిళా కానిస్టేబుల్ సహా మొత్తం ఆరుగురు కానిస్టేబుళ్లు ఉండేలా ప్రణాళిక రూపొందించారు. పరీక్ష గది, చీఫ్ సూపరింటెండెంట్, పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు పరిస్థితిని పరిశీలిస్తున్నారు. ఈ నెల 21 నుంచి 27 వరకు జరిగే పరీక్షలకు సంబంధించి రోజూ ప్రశ్నపత్రాలు, జవాబుపత్రాలు తరలించే జీపీఎస్ అమర్చిన వాహనాలు నిర్దేశిత మార్గాల్లోనే ప్రయాణించేలా రూట్‌మ్యాప్ రూపొందించారు.

# విమాన బెదిరింపు కాల్స్ చేస్తే జీవిత ఖైదు

## చట్టపరమైన మార్పులు తెచ్చే ప్రయత్నం.. పౌర విమానయాన మంత్రి రామ్మోహన్




**ముందడుగు ఢిల్లీ:** దేశంలో విమానయాన భద్రతకు మొదటి ప్రాధాన్యత అని, బెదిరింపులకు పాల్పడేవారిని నోఫ్లై జాబితాలో చేర్చేలా చట్టాలను సవరిస్తున్నామని కేంద్రమంత్రి కింజరపు రామ్మోహన్‌నాయుడు తెలిపారు. ఆయన సోమవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఇప్పటి వరకు వచ్చిన బెదిరింపులు మొత్తం బూటకమని తేలిందన్నారు. పౌర విమానయాన శాఖకు కఠినమైన ప్రొటోకాల్ ఉందని.. దానినే తమ శాఖ, విమానయాన సంస్థలు అనుసరిస్తోందని వివరించారు. ఇలాంటి బెదిరింపులు వచ్చిన సమయంలో పరిస్థితి చాలా సున్నితంగా ఉంటుందన్నారు. అంతర్జాతీయ విధివిధానాలను మనం అనుసరించాలని ఆయన వ్యాఖ్యానించారు. బెదిరింపు కాల్స్, సోషల్ మీడియా పోస్టులకు పాల్పడేవారికి జీవిత ఖైదు విధించేలా చట్టపరమైన మార్పులు తెచ్చేందుకు యత్నిస్తున్నామన్నారు.

ముందడుగు
మంగళవారం,
22-10-2024,
హైదరాబాద్

# ప్రజలపై విద్యుత్ భారాన్ని మోపుతున్నారు

## చార్జీల పెంపు ప్రతిపాదనలను తిరస్కరించాలి

## బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**ముందడుగు హైదరాబాద్:**

తెలంగాణలో విద్యుత్ చార్జీల పెంపు ప్రతిపాదనలను తిరస్కరించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు విద్యుత్ నియంత్రణ మండలిని కలిసి వారు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం వివిధ పేర్లు చెప్పి రూ. 18,500 కోట్ల విద్యుత్ భారాన్ని ప్రజలపై మోపేందుకు సిద్ధమైందన్నారు. ఇంత భారీగా ప్రజలపైన విద్యుత్ భారాన్ని మోపడం దారుణం. ఇప్పటికే ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాల వలన వ్యవసాయ రంగం నుంచి మొదలుకొని పారిశ్రామిక రంగం వరకు అన్ని సంక్షోభంలో కూరుకుపోయాయని కేటీఆర్ ధ్వజమెత్తారు.

# కాశ్మీర్ ఎప్పుడు పాకిస్థాన్‌లో భాగం కాదు

## ఉగ్రవాదాన్ని ఎగదోయడం పాక్ ఇప్పటికైనా ఆపాలి

## నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా

**ముందడుగు జాతీయం:**

పాకిస్థాన్‌లో కాశ్మీర్ ఎప్పటికి భాగం కాదని, అక్కడి ప్రజలకు నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా హామీ ఇచ్చారు. జమ్మూకశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడిని ఆయన తీవ్రంగా ఖండించారు. ఉగ్రవాదాన్ని భారత్‌లోకి ఎగదోయడాన్ని పాక్ ఇప్పటికైనా ఆపివేయాలని హితవు పలికారు. న్యూదిల్లీతో సత్సంబంధాలు ఏర్పరుచుకోవాలంటే పాకిస్థాన్ ఉగ్ర చర్యలకు స్వస్తి పలకాలని సూచించారు.



"కశ్మీర్ ఎప్పటికీ పాకిస్థాన్‌లో భాగం కాదు. ఇక్కడి ప్రజలు తమ జీవితాలను గౌరవంగా జీవించాలనుకుంటున్నారు. ఉగ్రవాదాన్ని అంతం చేసే సమయం వచ్చింది. భారత్ హెచ్చరికలను పాకిస్థాన్ పెడచెవిన పెడితే.. ఫలితాలు చాలా తీవ్రంగా ఉంటాయి" అని ఫరూక్ అబ్దుల్లా దాయాది దేశాన్ని హెచ్చరించారు. గాందర్‌బల్ జిల్లాలోని గుండ్ వద్ద శ్రీనగర్ లేహ్ జాతీయ రహదారిలో సొరంగ నిర్మాణపనులు చేస్తున్న కార్మికులు, సిబ్బంది ఆదివారం పనులు ముగించుకొని తమ ఇళ్లకు వచ్చిన సమయంలో ఇద్దరు ఉగ్రవాదులు వారిపై కాల్పులకు తెగబడ్డారు. కాల్పుల్లో ఓ వైద్యుడు, ఆరుగురు కార్మికులు మృతిచెందగా, మరో అయిదుగురు గాయపడ్డారు. దీంతో పోలీసు బలగాలు, సైనిక దళాలు ముష్కరుల గాలింపునకు చర్యలు చేపట్టాయి.

# ఒక్కో జంట 16 మంది పిల్లలను కనాలి

## తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్

**ముందడుగు తమిళనాడు:**

ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా 16 రకాల సంపదలకు బదులుగా 16 మంది పిల్లలను కనాల్సిన సమయం వచ్చిందని తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ అన్నారు. ఆ రాష్ట్ర హిందూ మత, ధర్మాదాయ శాఖ సోమవారం సామూహిక వివాహ కార్యక్రమం నిర్వహించింది. సీఎం స్టాలిన్ సమక్షంలో 31 జంటలకు వివాహం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కొత్తగా పెళ్లైన జంటలు ఎక్కువ మంది పిల్లలను కనాలని సూచించారు. 16 మంది పిల్లలను కనాల్సిన పరిస్థితి ప్రస్తుతం ఉందన్నారు. పూర్వ కాలంలో కొత్తగా పెళ్లైన జంటలు 16 రకాల సంపదలు పొందాలని పెద్దలు ఆశీర్వదించేవారని సీఎం స్టాలిన్ గుర్తు చేశారు. 'మీకు 16 కలిగి సుభిక్షంగా జీవించాలని పెద్దలు కోరుకునేవారు. అంటే 16 మంది పిల్లలు కాదు, 16 రకాల సంపదలను సూచిస్తుంది.



వీటిని 'ఆవు, ఇల్లు, భార్య, పిల్లలు, విద్య, జిజ్ఞాస, జ్ఞానం, క్రమశిక్షణ, భూమి, నీరు, వయస్సు, వాహనం, బంగారం, ఆస్తి, పంట, ప్రశంసలు' అని రచయిత విశ్వనాథన్ తన పుస్తకంలో పేర్కొన్నారు' అని తెలిపారు.

# ఢిల్లీలో దారుణంగా పడిపోయిన గాలి నాణ్యత

## తీవ్రంగా పెరిగిన శ్వాసకోశ సంబంధ వ్యాధులు

**ముందడుగు ఢిల్లీ:**

ఢిల్లీలో వాతావరణ మార్పులకు అనుగుణంగా గాలి నాణ్యత దారుణంగా పడిపోతున్నది. సోమవారం ఉదయానికి ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 349కి పడిపోయింది. దాంతో కాలుష్య నియంత్రణ మండలి ఈ పరిస్థితిని 'వెరీ పూర్' కేటగిరిగా వర్గీకరించింది. వాయు కాలుష్యం కారణంగా నగరంపై దట్టంగా పొగ మంచు కమ్మి ఉంటోంది. దాంతో ఉదయం పూట వాహనదారులు రోడ్లపై విజిబిలిటీ సరిగా లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గాలి నాణ్యతలు క్షీణించడంతో ఢిల్లీ వాసులు అనేక ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా శ్వాసకోశ సంబంధ సమస్యలు తీవ్రంగా పెరిగాయి. కాలుష్యాన్ని తగ్గించేందుకు ఢిల్లీ ప్రభుత్వం తగు చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే బాణాసంచా వినియోగం, తయారీపై ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వం నిషేధం విధించిన సంగతి తెలిసిందే. ప్రతి ఏడాది శీతాకాలంలో చల్లదనం కారణంగా ఢిల్లీలో గాలి నాణ్యత దెబ్బతింటున్నా ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం మాత్రం లభించడంలేదు.

ముందడుగు
మంగళవారం,
22-10-2024,
హైదరాబాద్

# కర్ణాటకలో కంబాలా రేసింగ్‌ను ఆపండి

## హైకోర్టును ఆశ్రయించిన పెటా



ముందడుగు కర్ణాటక:

కర్ణాటకలోని దక్షిణ కన్నడ జిల్లాలలో జరిగే కంబాలా రేసింగ్ పోటీలను నిలిపివేయాలని కోరుతూ సోమవారం రాష్ట్ర హైకోర్టును పెటా ఆశ్రయించింది. అక్టోబర్ 25వ తేదీన బెంగుళూరులో ఈ ఈవెంట్ జరగాల్సి ఉన్నది. ఆ రేస్‌ను ఆపేయాలని పిల్ వేశారు. జస్టిస్ ఎన్వీ అంజారియా, జస్టిస్ కేవీ అరవింద్‌లతో కూడిన ధర్మాసనం ఈ కేసును విచారించింది. పిల్ తరపున సీనియర్ న్యాయవాది ధ్యాన్ చిన్నప్ప వాదించారు.

దక్షిణ కన్నడ జిల్లాల్లో కంబాలా దున్నపోతల ఈవెంట్‌ను ఆర్గనైజ్ చేయడం అక్కడి సాంప్రదాయం. ఆ ఈవెంట్‌ను నిర్వహించేందుకు బెంగుళూరుకు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు చెందిన దున్నలను తీసుకువస్తారని చిన్నప్ప తన పిటీషన్‌లో వాదించారు. ఈ వెంట్‌ను నిర్వహించడమంటే.. జంతువుల్ని క్రూరంగా హింసించడమే అవుతుందని చిన్నప్ప కోర్టుకు తెలిపారు. ఈ ఏడాది జూలైలోనే పిల్ వేశామని, కానీ తమ కేసు లిస్టింగ్ కాలేదని పెటా తెలిపింది. జల్లికట్టు, కంబాలా లాంటి రేసులను నిర్వహించుకునేందుకు గత మే నెలలో సుప్రీంకోర్టు క్లియరెన్స్ ఇచ్చిన విషయం తెలిసిందే.

# భారత ప్రధాని మోడీ డిగ్రీపై వ్యాఖ్యలు..

## కేజ్రీవాల్ పిటీషన్ తోసిపుచ్చిన సుప్రీంకోర్టు



ముందడుగు జాతీయం:

భారత ప్రధాని మోడీ డిగ్రీ విద్యార్థులపై నమోదు అయిన కేసులో.. ఆమ్ ఆద్మీ పార్టీ చీఫ్ అరవింద్ కేజ్రీవాల్‌కు సోమవారం సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. ప్రధాని డిగ్రీపై కేజ్రీవాల్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ ఆయనపై గుజరాత్ యూనివర్సిటీ పరువునష్టం కేసును దాఖలు చేశారు. ఆ కేసులో ట్రయల్ కోర్టు సమన్లు జారీ చేశారు. ఆ సమన్లను కొట్టివేయాలని కేజ్రీవాల్ సుప్రీంను ఆశ్రయించారు. అయితే ట్రయల్ కోర్టు ఆదేశాలను కొట్టివేసేందుకు సుప్రీం నిరాకరించింది.


జస్టిస్ హృషికేశ్ రాయ్, ఎస్‌వీఎన్ భట్టిలతో కూడిన ధర్మాసనం ఈ కేసును విచారించింది. గతంలో ఇదే కేసులో ఆప్ నేత సంజయ్ సింగ్ వేసిన పిటీషన్‌ను కొట్టివేసినట్లు సుప్రీంకోర్టు గుర్తు చేసింది. అయితే కేజ్రీవాల్ తరపున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ వాదించారు. సంజయ్ సింగ్ చేసిన వ్యాఖ్యలు భిన్నమైనవి ఆయన కోర్టుకు చెప్పారు. కానీ ఆ పిల్‌ను విచారించేందుకు కోర్టు నిరాకరించింది. సంజయ్ సింగ్‌పై కూడా గుజరాత్ వర్సిటీ కేసు బుక్ చేసిందని, ఈ కేసులో ఒకవిధమైన ఆదేశాలు ఉండాలని, అందుకే కేజ్రీవాల్ పిటీషన్‌ను స్వీకరించడం లేదని, దాన్ని డిస్మిస్ చేస్తున్నామని కోర్టు చెప్పింది.



# బుజ్జమ్మ అని పిలుస్తారు!

'కెరీర్ తొలినాళ్లలో లవ్‌స్టోరీస్ చేయాలనుకున్నా. అయితే 'మల్లేశం' సినిమా తర్వాత అలాంటి మెచ్యూర్డ్ క్యారెక్టర్స్‌లో ప్రేక్షకులు నన్ను చూడాలనుకుంటున్నారు. ఈ విషయంలో చాలా ఆనందంగా ఉంది' అని చెప్పింది అనన్య నాగళ్ల. ఆమె కథానాయికగా నటించిన తాజా చిత్రం 'పొట్టేల్' ఈ నెల 25న ప్రేక్షకులముందుకురానుంది. ఈ సందర్భంగా సోమవారం అనన్య నాగళ్ల పాత్రికేయులతో ముచ్చటిస్తూ 'ఈ సినిమాలో బుజ్జమ్మ అనే మదర్ క్యారెక్టర్‌లో కనిపిస్తా. కథలో నా పాత్రకు చాలా ప్రాధాన్యత ఉంటుంది. ఈ సినిమా తర్వాత నన్ను బుజ్జమ్మ అని పిలుస్తారేమో (నవ్వుతూ). దర్శకుడు సాహిత్ నా పాత్రను చాలా గొప్పగా తీర్చిదిద్దాడు' అని చెప్పింది. కథానుగుణంగానే 'పొట్టేల్' అనే టైటిల్ పెట్టారని, పొట్టేల్ తన దారిలో ఎన్ని అవాంతరాలు ఎదురైనా ఢీకొట్టి వెళ్తుందని, అదే స్వభావంతో సినిమాలో హీరో క్యారెక్టర్ కనిపిస్తుందని ఆమె తెలిపింది. తెలంగాణ సంస్కృతి, సామాజిక సందేశం అద్భుతంగా కలబోసిన కథాంశమిదని, చాలా సన్నివేశాలు కన్నీళ్లు తెప్పిస్తాయని అనన్య పేర్కొంది. కెరీర్ గురించి మాట్లాడుతూ 'మంచి అవకాశాలు వస్తున్నాయి. పర్‌ఫార్మెన్స్ ఓరియెంటెడ్ రోల్స్ కోసం ఇండస్ట్రీలో ఉన్న ఇద్దరుముగ్గురు తెలుగమ్మాయిల్లో నా పేరు కూడా ప్రముఖంగా వినిపిస్తున్నది. అందుకే 'పొట్టేల్'లాంటి ఎమోషనల్ సినిమాలో ఛాన్సొచ్చింది' అని చెప్పింది.

ముందడుగు
మంగళవారం, 22-10-2024, హైదరాబాద్



# ఈ 5 వ్యాధులతోనే ఎక్కువమంది చనిపోతున్నారు

## ప్రాణాలు తీస్తున్న భయంకరమైన వ్యాధులు ఇవే.. వీటిపై నిర్లక్ష్యమే ప్రాణాలు పోతున్నాయి

ముందడుగు ప్రత్యేకం:

ప్రస్తుత సమాజంలో మనిషి జీవితం ఉరుకుల పరుగులతోనే కొనసాగుతోంది.. బిజిబిజీ జీవితంలో పడి చదువు, ఉద్యోగం, ఇతర బాధ్యతల్లో పడి ఆరోగ్యాన్ని విస్మరిస్తున్నారు. జంక్ ఫుడ్‌కు అలవాటు పడుతున్నారు. చాలామందికి వ్యాయామం చేయడానికి సమయం కూడా దొరకడం లేదు. ఇలాంటి అలవాట్ల వల్ల చాలా రకాల వ్యాధులు వస్తున్నాయి. ముఖ్యంగా దేశంలో కొన్ని వ్యాధులు ఎక్కువగా వ్యాపిస్తున్నాయి. ఎక్కువ మంది మరణాలకు ఐదు వ్యాధులు కారణమవుతున్నాయి. వీటిని నిర్లక్ష్యం చేస్తే ప్రమాదం తప్పదు. మన ఆరోగ్యాన్ని పూర్తిగా దెబ్బతీస్తాయి. ఆ వ్యాధిలేవో తెలుసుకుందాం..

### క్యాన్సర్

మన దేశంలో క్యాన్సర్ అతి పెద్ద ప్రాణాంతక వ్యాధిగా మారుతోంది. ఏటా క్యాన్సర్ బారిన పడే వారి సంఖ్య పెరుగుతోంది. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ అంచనా ప్రకారం, 2025 నాటికి భారతదేశంలో 15.7 లక్షలకు క్యాన్సర్ కేసులు పెరుగుతాయి. అనారోగ్యకరమైన ఆహారం, పొగాకు వాడటం, కాలుష్యం, వ్యాధిని తొలిదశలో గుర్తించకపోవడం వంటి కారణాల వల్ల ఈ కేసులు ఏటా పెరుగుతూ పోతున్నాయి. వ్యాధిని మొదట్లోనే గుర్తించి, సరైన చికిత్స చేయించుకుంటే కోలుకోవడానికి అవకాశం ఉంటుంది. కానీ చాలా మంది వ్యాధిని చాలా ఆలస్యంగా గుర్తిస్తున్నారు. అప్పటికే పరిస్థితి చేయిదాటిపోతోంది.

### గుండె జబ్బులు

భారతీయులు గుండె జబ్బుల బారిన పడటం సర్వసాధారణమైంది. వయసుతో సంబంధం లేకుండా చాలా మంది హార్ట్ ఎటాక్స్‌తో మరణిస్తున్నారు. 2022లో 32,457 మంది హార్ట్ ఎటాక్ కారణంగా మరణించారు. 2021వ సంవత్సరంతో పోలిస్తే ఈ సంఖ్య 12.5% పెరిగింది. అధిక రక్తపోటు, అధిక కొలెస్ట్రాల్, షుగర్, పొగాకు వాడటం, వ్యాయామం చేయకపోవడం వంటి అలవాట్ల వల్ల గుండె సమస్యలు పెరుగుతున్నాయి.

### డయాబెటిస్

ప్రపంచంలోనే అత్యధికంగా షుగర్ రోగులు మన దేశంలోనే ఉన్నారు. 2025 నాటికి భారత్‌లో మొత్తంగా ఏడు కోట్ల మంది బాధితులు ఉండవచ్చని అంచనా. డయాబెటిస్ రెండు రకాలు. ఒకటి టైప్ 1, మరొకటి టైప్ 2. ఈ రెండు రకాల షుగర్ వ్యాధి వల్ల గుండెపోటు, పక్షవాతం వంటి తీవ్రమైన సమస్యలు వచ్చే అవకాశం ఉంది. అనారోగ్యకరమైన ఆహారం, అధిక బరువు, వ్యాయామం చేయకపోవడం వల్ల షుగర్ వ్యాధి రావచ్చు.

### క్షయ వ్యాధి

ట్యూబర్క్యులోసిస్ లేదా క్షయ వ్యాధి చాలా మంది భారతీయులను బాధిస్తోంది. ఏటా దాదాపు 28 లక్షల మందికి క్షయ వస్తుంది. ఈ వ్యాధి ముఖ్యంగా ఊపిరితిత్తులను ప్రభావితం చేస్తుంది. కానీ ఇది శరీరంలోని ఇతర భాగాలకూ వ్యాపించవచ్చు. క్షయ రోగుల దగ్గరగా ఉన్నప్పుడు లేదా తుమ్ముతున్నప్పుడు గాలి ద్వారా ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తుంది. దీనికి చికిత్స అందుబాటులో ఉన్నా, చాలా మందికి సరైన చికిత్స దొరకడం లేదు. దీంతో వారి ఆరోగ్యం పాడవుతుంది. టీబీని నియంత్రించాలంటే ప్రజలకు అవగాహన కల్పించడం ముఖ్యం.

### ఒబేసిటీ

మన దేశంలో చాలా మంది ఒబేసిటీ లేదా అధిక బరువుతో బాధపడుతున్నారు. ఎక్కువ కేలరీలు తీసుకోవడం వల్ల చాలా మందిలో బొజ్జ పెరుగుతోంది. జంక్ ఫుడ్, తీపి పదార్థాలు, ప్యాక్డ్ స్నాక్స్ వంటివి ఆరోగ్యానికి మంచివి కావు. బరువు ఎక్కువగా ఉంటే షుగర్, గుండె జబ్బులు, కీళ్ల నొప్పులు వంటి సమస్యలు వచ్చే అవకాశముంది. కొన్ని రకాల క్యాన్సర్లకు కూడా ఇదే కారణం కావచ్చు. బరువు తగ్గాలంటే పండ్లు, కూరగాయలు, గోధుమలు, మాంసం వంటివి బ్యాలెన్స్‌డ్‌గా తినాలి. రోజూ వ్యాయామం చేయాలి.